క్లుప్తంగా

వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు



ఇబ్రహీంపట్నం: వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ పాలడుగు జ్యోత్స్న ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీపీ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. ఆమె మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో సర్పంచులు, ఎంపీటీసీలు, ఆర్‌డబ్ల్యూఎస్, విద్యుత్ శాఖ అధికారులు తాగునీటి పంపిణీలో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆయా గ్రామాల్లోని సమస్యలను ప్రజాప్రతినిధులు అధికారుల దృష్టికి తెచ్చారు. వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు ఆయా శాఖల పురోగతిని వివరించారు. ఎంపీడీఓ రామకృష్ణనాయక్, తహసీల్దార్ సూర్యారావు, ఏఓ శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

రెడ్డిగూడెం: మండలంలో సమస్యలు పరిష్కరించేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలని ఎంపీపీ రామినేని దేవి ప్రవణ్య అన్నారు. మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని గురువారం నిర్వహించారు. గ్రామాల్లో ఉన్న సమస్యలను సభ్యులు సభలో ప్రస్తావించారు. వెంటనే సమస్యలను పరిష్కరించాలని ఎంపీపీ ఆదేశించారు. శాఖల వారీగా అధికారులు ప్రగతిని వివరించారు. జెడ్పీటీసీ సభ్యుడు పాలంకి విజయభాస్కరరెడ్డి, ఎంపీడీఓ శంకరరావు, తహసీల్దార్ పాల్, వైస్ ఎంపీపీ రాబర్టు, పి.శ్రీనివాసరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ

తిరువూరు: స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో గురువారం సమగ్ర శిక్షాభియాన్ అధికారులు మధ్యాహ్న భోజనాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఏఎస్‌ఓలు అశోక్‌బాబు, సుధాకర్ తొలుత మండల విద్యాశాఖాధికారి కార్యాలయాన్ని సందర్శించి రికార్డులు పరిశీలించారు. బాలికోన్నత పాఠశాలలో మధ్యాహ్నభోజన సరఫరా తీరును విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. ఇన్‌చార్జి ఎంఈఓ రామకృష్ణ, బాలికోన్నత పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం నాగకుమారి, సీఆర్పీలు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి మున్సిపాలిటీ పరిధిలో జగనన్న ఇళ్ల లబ్ధిదారులతో ఇళ్ల నిర్మాణాలు నూరు శాతం పూర్తిచేసేలా అవగాహన కల్పించాలని మున్సిపల్ కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వర్లు ఆదేశించారు. స్థానిక కార్యాలయంలో సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, గ్రేడ్ – 5 కార్యదర్శులకు ఇళ్ల నిర్మాణాల్లో చేపట్టాల్సిన చర్యలపై గురువారం అవగాహన కల్పించారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇళ్ల నిర్మాణంలో ప్రతి లబ్ధిదారుడిని వ్యక్తిగతంగా కలిసి నిర్మాణాలు జరిగేలా చూడాలన్నారు. హౌసింగ్ ఏఈ నాగరాజు పాల్గొన్నారు.

6న నేత్ర వైద్యశిబిరం

తిరువూరు: తిరువూరులో సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఈ నెల 6వ తేదీన ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు కన్వీనర్ దామెర ప్రభాకరరావు తెలిపారు. కోకిలంపాడు రోడ్డులోని సత్యసాయి సేవా సమితి ఆవరణలో ఉదయం 9 గంటలకు ఏర్పాటు చేసే వైద్య శిబిరంలో నూజివీడు గిఫర్డ్ మెమోరియల్ ఆస్పత్రి వైద్యులు రోగులను పరీక్షించి అవసరమైన మందులు అందజేస్తారన్నారు.

కల్యాణమస్తు అందజేత

తిరువూరురూరల్: మండలంలోని టేకులపల్లి పాల ఉత్పత్తిదారుల సహకార సంఘ సభ్యుడు మోదుగు కృష్ణ కుమారుడు కోటేశ్వరరావు వివాహం సందర్భంగా కృష్ణా మిల్క్ యూనియన్ కల్యాణ మస్తు పథకం కింద రూ.20 వేలను గురువారం అందజేశారు. లక్ష్మీపురం పాలశీతల కేంద్ర మేనేజర్ సాంబశివమూర్తి, జిల్లా యూనియన్ సభ్యులు సత్యనారాయణ, సుబ్బారెడ్డి చెక్కును కోటేశ్వరరావుకు అందించారు.

పుట్రేల రోడ్డులో లారీ బోల్తా

విస్సన్నపేట: స్థానిక పుట్రేల రోడ్డులో వికాస్ పీజీ కళాశాల సమీపంలో అదుపుతప్పి వాగులో లారీ బోల్తా పడిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించే క్రమంలో భీమవరానికి కోళ్ల దాణా రవాణా చేస్తున్న లారీ అదుపు తప్పి వాగులో పల్టీ కొట్టింది. ప్రమాదం జరిగిన సమయంలో లారీలో డ్రైవర్‌తో పాటు మరో ఇద్దరు ఉండగా ముగ్గురు సురక్షితంగా బయటపడ్డారు.

చురుగ్గా ప్రభుత్వ భవనాల నిర్మాణం

- రూ.16.27కోట్లతో 60 భవనాల నిర్మాణం
- 50 శాతం పూర్తయిన భవనాలు



గంపలగూడెం మండలం కొణిజెర్లలో ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న ప్రభుత్వ భవనాలు

గంపలగూడెం: పరిపాలన వికేంద్రీకరణతో ప్రజల సమస్యలను స్థానికంగానే పరిష్కరించాలన్న లక్ష్యంతో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన సచివాలయ వ్యవస్థ మంచి ఫలితాలను ఇస్తోంది. సచివాలయ వ్యవస్థ అమలులో భాగంగా ప్రతి సచివాలయ పరిధిలో మూడు ప్రభుత్వ భవనాలను నిర్మించాలని ప్రభుత్వం ఆదేశించడంతో పాటు తగిన నిధులను కూడా కేటాయించింది. దీంతో లక్ష్యాల సాధనకు ప్రతి సచివాలయం పరిధిలో గ్రామ సచివాలయ భవనం, రైతుభరోసా కేంద్రం, వైఎస్సార్ హెల్త్ సెంటర్ల నిర్మాణం చేపట్టింది. దీనికై అవసరమైన నిధుల కేటాయింపులో కూడా ప్రభుత్వం ఏమాత్రం వెనుకంజ వేయకుండా సమకూర్చడంతో భవనాల నిర్మాణం చురుగ్గా సాగుతోంది. సంబంధిత భవనాలు పలు పంచాయతీల్లో ప్రధాన రహదారుల వెంట ఆకర్షణీయంగా రూపుదిద్దుకుంటున్నాయి. ప్రభుత్వ భవనాల్లో ప్రజలకు తగిన సేవలను అందించేందుకు అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పిస్తున్నారు.

21 సచివాలయాల పరిధిలో..

తెలంగాణ రాష్ట్రానికి సరిహద్దుగా ఉన్న ఎన్టీఆర్‌జిల్లా గంపలగూడెం మండలంలో 24 గ్రామ పంచాయతీలు ఉండగా 21 సచివాలయాలుగా ఏర్పాటు చేశారు. వీటిలో పెద్ద పంచాయతీగా ఉన్న గంపలగూడెం, పెనుగొలను, ఊటుకూరు గ్రామాలకు రెండేసి చొప్పున సచివాలయాలు ఉండగా మిగిలిన గ్రామాల్లో ఒక్కో సచివాలయం ఏర్పాటు అయింది. ఆయా సచివాలయాల పరిధిలో 21 గ్రామ సచివాలయ భవనాలు, 21 రైతు భరోసా కేంద్రాలు, 19 వైఎస్సార్ హెల్త్ సెంటర్ల కలిపి మొత్తం 60 భవనాల నిర్మాణానికి రూ.16.30కోట్లను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసింది. దీంతో భవన నిర్మాణాలు వేగవంతంగా కొనసాగుతున్నాయి. ఒక్కో సచివాలయ భవనానికి రూ.40 లక్షలు, రైతు భరోసా కేంద్రానికి రూ.21.80 లక్షలు, వెల్‌నెస్ సెంటర్‌కు రూ.17.50లక్షల ఖర్చుతో భవన నిర్మాణాలను చేపట్టారు. ఇప్పటి వరకు 12 గ్రామ సచివాలయ భవనాలు, 9 రైతు భరోసా కేంద్రాలు, 7 వెల్‌నెస్ సెంటర్ల భవన నిర్మాణాలు పూర్తయ్యాయి. మరో 8 గ్రామ సచివాలయ భవనాలు వివిధ దశల్లో నిర్మాణం కొనసాగుతుండగా, పెద్దకొమిర సచివాలయ భవన నిర్మాణం చేపట్టాల్సి ఉంది. 11 రైతు భరోసా కేంద్రాలు, 10 వైఎస్సార్ హెల్త్ సెంటర్ల భవన నిర్మాణాలు వివిధ దశల్లో కొనసాగుతున్నాయి. ఊటుకూరు–2 రైతు భరోసా కేంద్రం, పెద్దకొమిర, చింతలనర్వ వెల్‌నెస్ సెంటర్ల భవనాల నిర్మాణం ప్రారంభించాల్సి ఉంది.

అమల్లోకి వచ్చిన భవనాలు

నిర్మాణం పూర్తయిన 12 భవనాలు ఇప్పటికే ఎమ్మెల్యే కె.రక్షణనిధి ప్రారంభించారు. పెనుగొలను–1, 2, కనుమూరు, గొల్లపూడి,గోసవీడు, ఆర్లపాడు సచివాలయాలు, పెనుగొలను–2, కనుమూరు, గొల్లపూడి ఆర్బీకే, గొల్లపూడి, కనుమూరు, పెనుగొలను–2 వైఎస్సార్ హెల్త్ సెంటర్ భవనాలను ప్రారంభించారు.

ప్రభుత్వ భవనాల్లో సౌకర్యాలు

గ్రామ సచివాలయాలకు ఒక అంతస్తు భవనం, ఆ భవనంలో కింది భాగంలో హాలు, సెక్రటరీ గది, మెటీరియల్ హాల్, గోడౌన్ మొదటి అంతస్తులో కారిడార్, హాలు, గ్రామ ప్రథమపౌరుల గది, విశ్రాంతి రూము, మరుగుదొడ్లు ఉన్నాయి. రైతు భరోసా కేంద్రంలో అగ్రి ఇన్‌పుట్ రూమ్, హాలు, వ్యవసాయ మందుల షాపు, పరికరాల గది, టాయిలెట్స్, నీటి వసతితో కూడి ఉంటుంది. వైఎస్సార్ హెల్త్ సెంటర్లో రోగులను పరీక్షించే గది, రోగులగది, మందులు ఇచ్చే రూము, పరికరాల గది, ల్యాబ్, మరుగుదొడ్లు, వైద్యుల గది, వైద్యుల నివాసానికి అవరమైన అన్ని వస్తువులతో భవన నిర్మాణాలు ఉన్నాయి.

ప్రజల ఇబ్బందులు తొలిగాయి

గతంలో ఏ సర్టిఫికేట్ కావాలన్నా మండల కేంద్రాలకు లేదా నియోజకవర్గ కేంద్రాలకు తిరగాల్సి వచ్చేది. సచివాలయ, వలంటీర్ వ్యవస్థల ఏర్పాటుతో ప్రజలకు ఎంతో చేరువుగా సౌకర్యాలు అందుతున్నాయి. వలంటీర్లే అవసరదారుల ఇళ్లకు వెళ్లి మరీ దరఖాస్తు చేస్తున్నారు. దీంతో కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేసే పరిస్థితి ప్రస్తుతం సచివాలయ వ్యవస్థలో లేదు.

మెరుగైన సేవలు



నూతనంగా ఏర్పడిన ఆంధ్రరాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే వినూత్నం తీసుకువచ్చిన సచివాలయ వ్యవస్థ, అవసరమైన భవన నిర్మాణాలతో ప్రజలకు మెరుగైన సేవలు అందుతున్నాయి. సచివాలయ సిబ్బంది, వలంటీర్ల ద్వారా ప్రజలకు అవసరాలను గుర్తించి ఆయా పథకాలకు, వివిధ సర్టిఫికెట్లకు దరఖాస్తు చేయించి ప్రజలకు అందేలా కృషి చేస్తున్నారు.

– వై.పిచ్చిరెడ్డి, ఎంపీడీఓ, గంపలగూడెం

90 శాతానికి పైగా పరిష్కారం



సచివాలయ వ్యవస్థతో ప్రజలకు చేరువలోనే 11 శాఖలకు సంబంధించిన సిబ్బంది గ్రామాల్లో పనిచేస్తూ ప్రజా సమస్యలను తీరుస్తున్నారు. ప్రధానంగా రెవెన్యూ శాఖకు సంబంధించి ప్రతి గ్రామానికీ సర్వేయర్ కేటాయింపు వలన సర్వే పనులు 90శాతం పైగా పరిష్కారానికి నోచుకుంటున్నాయి. వివిధ సర్టిఫికెట్లను పొందేందుకు కూడా సచివాలయాల్లోనే దరఖాస్తు చేసుకునే అవకాశం ప్రభుత్వం కల్పించింది.

– బాలకృష్ణారెడ్డి, తహసీల్దార్, గంపలగూడెం

మౌలిక వసతుల కల్పనే ప్రధాన లక్ష్యం

ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణ ప్రసాద్



కవులూరులో ప్రభుత్వ పథకాల లబ్ధిపై ఆరా తీస్తున్న ఎమ్మెల్యే వసంత

జి.కొండూరు: గ్రామాల్లో ప్రజలకు ప్రధానంగా అవసరమైన తాగునీరు, డ్రైనేజీ, అంతర్గత రహదారుల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణప్రసాద్ అన్నారు. మండల పరిధి కవులూరు గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి గురువారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లిన ఎమ్మెల్యే వసంత, స్థానిక సమస్యలు, ప్రభుత్వ పథకాల పంపిణీపై ఆరా తీశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వేసవి సమీపించిన వేళ గ్రామంలో తాగునీరు సమస్య ఉంటే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. గ్రామంలో ఇప్పటికే జగనన్న కాలనీ కోసం లేఅవుట్‌ని ఏర్పాటు చేసి స్థలాలు పంపిణీ చేసిన నేపథ్యంలో లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణం చేపట్టాలని చెప్పారు. అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు సమన్వయంతో ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి పనులు

తిరువూరు ఎమ్మెల్యే రక్షణనిధి



తిరువూరులో సీసీ రహదారి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రక్షణనిధి

తిరువూరు: తిరువూరు పట్టణంలో ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి పనులు చేపడుతున్నామని ఎమ్మెల్యే రక్షణనిధి తెలిపారు. తిరువూరు నగర పంచాయతీ 12వ వార్డులో సీసీ రహదారుల నిర్మాణ పనులకు గురువారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలు తెలిపిన సమస్యలు పరిగణనలోకి తీసుకుని నిధులు కేటాయిస్తున్నామన్నారు. పట్టణంలో దీర్ఘకాలంగా నెలకొన్న రహదారులు, మురుగు కాలువల సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామని, అన్ని ప్రాంతాల్లో పక్కా డ్రెయిన్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. వార్డు సచివాలయాల్లో అన్ని ప్రభుత్వ పథకాలకు సంబంధించిన సమాచారం అందుబాటులో ఉంటుందని చెప్పారు. నగర పంచాయతీ చైర్‌పర్సన్ గత్తం కస్తూరిబాయి, వైస్ చైర్‌పర్సన్లు విజయలక్ష్మి, వెంకటేశ్వరి, కౌన్సిలర్లు తంగిరాల వెంకటరెడ్డి, ఇనపనూరి చిన్నారి, పరసా శ్రీనివాసరావు, సత్యనారాయణ, మోదుగు ప్రసాద్, మూడు దుర్గారావు, పసుపులేటి శేఖర్‌బాబు, కోఆప్షన్ సభ్యుడు ఏరువ ప్రకాష్‌రెడ్డి, ఆదినారాయణ, నాయని కోటేశ్వరరావు, అంబటి వెంకటనారాయణరెడ్డి, సురేష్, పాపారావు, బండి రవి, చలమాల సత్యనారాయణ పాల్గొన్నారు.

ముమ్మరంగా పింఛన్ల పంపిణీ

ఇబ్రహీంపట్నం: వైఎస్సార్ పింఛన్ల పంపిణీ ఇబ్రహీంపట్నం మండలంలో నూరు శాతం పూర్తయినట్లు ఎంపీడీఓ రామకృష్ణ నాయక్ తెలిపారు. మొత్తం 4,709 మందికి రెండు రోజుల్లో పింఛన్ పంపిణీ చేశామన్నారు. కొండపల్లి మున్సిపాలిటీ పరిధిలో 5,142 మంది లబ్ధిదారుల్లో రెండు రోజుల్లో 4,906 మందికి 95.41 శాతం పింఛన్ అందజేశామని మున్సిపల్ కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వర్లు తెలిపారు.

మైలవరం: మండలంలో గురువారానికి 98 శాతం పెన్షన్‌లు పంపిణీ చేశామని ఎంపీడీఓ లక్ష్మీకుమారి తెలిపారు. మండలంలోని వలంటీర్లు రెండు రోజుల్లో 9,768 మంది లబ్ధిదారులకు పెన్షన్‌లు పంపిణీ చేశారన్నారు. వేలి ముద్రలు పడని వారికి ఫేస్ రీడింగ్ యాప్ ద్వారా పెన్షన్ అందజేశామని చెప్పారు.

ఆస్పత్రికి వెళ్లి పింఛన్ అందజేత

ఇబ్రహీంపట్నం: రోడ్డు ప్రమాదంలో గాయపడి కాలి పాదం వరకు కోల్పోయిన పింఛన్ లబ్ధిదారురాలు సంతోషమ్మ విజయవాడలోని ఓ వైద్యశాలలో చికిత్స పొందుతుంది. కొండపల్లి మున్సిపాలిటీ పరిధిలోని రెండో సచివాలయం వలంటీర్ నల్లమోతు ప్రశాంతి వైద్యశాలకు వెళ్లి పింఛన్ అందజేశారు. వలంటీర్‌ను అభినందించారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

నూజివీడు: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని దిగవల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఎం.శ్రీనివాస్ అన్నారు. బేటీ బచావో బేటీ పడావో వారోత్సవాల్లో భాగంగా మండలంలోని దిగవల్లి హైస్కూల్‌లో గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బాలికలను రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఆడ పిల్లలకు 18 ఏళ్లు, మగ పిల్లలకు 21 ఏళ్ల వయస్సు నిండకుండా ముందుగానే వివాహం చేస్తే చట్టరీత్యా నేరమని హెచ్చరించారు. పీహెచ్‌సీ సిబ్బంది, హైస్కూల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యుక్త వయస్సు వచ్చే వరకు వివాహాలు వద్దు

తోటమూల(గంపలగూడెం): బాలికలు యుక్త వయస్సు వచ్చే వరకు వివాహాలు చేసుకోవద్దని గంపలగూడెం పీహెచ్‌సీ డాక్టర్ వి.శృతి తెలిపారు. తోటమూల కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో గంపలగూడెం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమం నిర్వహించారు. బాల్యం వివాహాలు వల్ల కలిగే అనర్థాలను వివరించారు. విద్యార్థినులు ప్రదర్శించిన నాట్యం ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ప్రత్యేక అధికారి వెంకటలక్ష్మి, సీహెచ్‌ఓ నరసాయమ్మ, ఎంపీహెచ్‌ఈఓ ఏ.రాధాకృష్ణ, ఎంఎల్‌హెచ్‌పీ ప్రశాంత్‌కుమార్, ఏఎన్‌ఎంలు ఎం.రాణి, టి.అరుణ, ఆశా వర్కర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎ.కొండూరులో ర్యాలీ

ఎ.కొండూరు: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఈ నెల 8వ తేదీ వరకు నిర్వహించే అంతర్జాతీయ దినోత్సవాన్ని పురస్కరించుకుని బేటీ బచావో – బేటీ పడావో అంశంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి వి.స్వాతి మాట్లాడుతూ.. మండలంలోని అన్ని గ్రామాల్లో ఈ నెల 8వ తేదీ వరకు అవగాహన ర్యాలీలు నిర్వహిస్తామన్నారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం చట్ట విరుద్ధమని చెప్పారు. కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయ విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి చట్టంపై అవగాహన కల్పించామన్నారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం, తెలుసుకోవడం నేరమని తెలిపారు. సూపర్‌వైజర్ మురళీ, సిబ్బంది రాజేశ్వరి, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

దేవాలయాల హుండీ ఆదాయం లెక్కింపు

తిరువూరు: దేవదాయ శాఖ ఆధీనంలోని తిరువూరు గ్రూపు దేవాలయాల్లో హుండీ కానుకలను గురువారం లెక్కించారు. శ్రీవేంకటాచలస్వామి దేవస్థానంలో రూ.3,66,683, శ్రీరామలింగేశ్వరస్వామిదేవస్థానంలో రూ.84,989, శ్రీ చంద్రమౌళీశ్వరాలయంలో రూ.59,650 హుండీ ఆదాయం వచ్చిందని గ్రూపు ఆలయాల మేనేజరు వెంకటేశ్వర్లు తెలిపారు. కానుకల లెక్కింపులో గన్నవరం డివిజన్ తనిఖీ అధికారి ఏ.శ్రీనివాసరావు, ఆలయాల పాలకవర్గాల అధ్యక్షులు వేణుబాబు, ముత్తారావు, సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం

చాట్రాయి: మండలంలోని నరసింహారావుపాలెం చనుబండ గ్రామాల మధ్యనున్న శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయ 18వ వార్షికోత్సవాన్ని గురువారం వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామి వారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు, హనుమాన్ చాలీసా పారాయణ నిర్వహించారు. 3 వేల మంది భక్తులకు అన్నసమారాధన చేశారు.

నవధాన్యాల సాగుపై దృష్టి సారించాలి

నూజివీడు: రైతులు నవధాన్యాల సాగుపై దృష్టి సారించాలని సర్పంచ్ పొట్లూరి అంజనాకుమారి తెలిపారు. మండలంలోని జంగంగూడెంలో గురువారం ప్రకృతి వ్యవసాయం సిబ్బంది ఆధ్వర్యంలో నవధాన్యాల సాగుపై పాఠశాల విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. సర్పంచ్ మాట్లాడుతూ పప్పు దినుసులు, చిరుధాన్యాలు, పచ్చిరొట్ట ఎరువులు వంటి వాటిని సాగు చేయాలన్నారు. ప్రకృతి వ్యవసాయ అధికారి ఆర్.అల్ఫోన్సారాణి మాట్లాడుతూ నవధాన్యాలను సాగు చేయడం వల్ల భూమి సారవంతమవుతుందన్నారు. రసాయన ఎరువులను విచ్చలవిడిగా వాడడం వల్ల భూమి నిస్సారమై పంటల దిగుబడి తగ్గిపోతుందన్నారు. ఐసీఆర్పీలు రవికుమార్, సత్యవతి పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సేవలు అభినందనీయం

ముసునూరు: పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థుల సేవలు అభినందనీయమని చారిత్రక ముసునూరు హైస్కూల్ హెచ్‌ఎం శ్రీనివాస్ అన్నారు. హైస్కూల్ పూర్వ విద్యార్థి దేవినేని రుక్మాంబ పాఠశాల విద్యార్థుల సౌకర్యార్థం రూ.8 లక్షలతో మధ్యాహ్న భోజనానికి డైనింగ్ హాలు, కిచెన్ రూమ్‌తో పాటు, రూ.2 లక్షలతో బాస్కెట్ బాల్ గ్రౌండ్ నిర్మాణానికి నిధులు అందజేశారు. పాఠశాలలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో విద్యుత్ సరఫరాకు అవసరమైన సోలార్ పవర్ ప్లాంట్ నిర్మాణం కోసం ప్రవాస భారతీయ దాత నూతక్కి రామకృష్ణ దంపతులు రూ.1,50,000లు చెక్కును హెచ్‌ఎంకు అందించి, నిర్మాణాల పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో విశ్రాంత హెచ్‌ఎం తోటకూర సాంబశివరావు, పూర్వ విద్యార్థులు దేవినేని ప్రసాద్, లక్ష్మణరావు, కుటుంబరావు, ఉపాధ్యాయులు అల్లా బక్షు, జె.రంగారావు, నాగేశ్వరరావు, యువరాజు, సుకుమార్ పాల్గొన్నారు.

గ్యాస్ ధరలు వెంటనే తగ్గించాలి

విస్సన్నపేట: కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరలు వెంటనే తగ్గించాలని సీపీఎం మండల కార్యదర్శి వి.నాగరాజు డిమాండ్ చేశారు. స్థానిక బస్టాండ్ సెంటర్‌లో పెంచిన గ్యాస్ ధరలకు సీపీఎం ఆధ్వర్యంలో గురువారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ఏడాదిలో మూడు సార్లు గ్యాస్ ధరలు పెంచిందన్నారు. గ్యాస్ ధరలు పెంచటం వలన ప్రజలపై భారం పడుతుందని, వెంటనే పెంచిన ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యుడు జి.రామకృష్ణ, నాయకులు చిట్టిబాబు, సునీల్, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.


వంట గ్యాస్ ధర పెంపు దుర్మార్గం

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కేంద్ర ప్రభుత్వం వంట గ్యాస్ ధరపై రూ.50 పెంచడం దుర్మార్గమని డీసీసీ అధ్యక్షుడు బొర్రా కిరణ్ విమర్శించారు. కొండపల్లిలో ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన గురువారం మాట్లాడుతూ.. ఎనిమిదేళ్ల కాలంలో బీజేపీ ప్రభుత్వం గ్యాస్ ధర రూ.800 పెంచిందన్నారు. 2014లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం అంతర్జాతీయ మార్కెట్‌లో ముడిచమురు ధర బ్యారెల్‌కు 144 డాలర్లు ఉండగా సిలిండర్ రూ.410కి అందజేసిందని తెలిపారు. ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్‌లో ముడిచమురు బ్యారెల్‌కు 90 డాలర్లు మాత్రమే ఉండగా సిలిండర్ ధర రూ.1200 చేయడం దుర్మార్గమని మండిపడ్డారు. సిలిండర్ ధర తగ్గించాలని డిమాండ్ చేశారు. పీసీసీ కార్యదర్శి పోతురాజు ఏసుదాసు పాల్గొన్నారు.

పెంచిన గ్యాస్ ధరలను తగ్గించాలి

ఆగిరిపల్లి: పెంచిన వంట గ్యాస్ ధరలను కేంద్ర ప్రభుత్వం వెంటనే తగ్గించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక పెద్ద కొఠాయి సెంటర్ వద్ద ధర్నా చేశారు. సీఐటీయూ నాయకులు రాజులపాటి చంటి, జహంగీర్ భాషా, కోటేశ్వరరావు, డి.నాగరాజు, ఎస్.రమేష్ పాల్గొన్నారు.

బాబూ పోతన సేవలు అభినందనీయం



మైలవరం: సువార్తీకులు ఇందుపల్లి బాబూ పోతన సేవలు అభినందనీయమని నందిగామ దైవ సేవకులు బ్రదర్ కోట రవీంద్రనాథ్ తెలిపారు. మైలవరం పొందుగల రోడ్డులోని క్రీస్తు సంఘం నిర్వాహకులు బ్రదర్ ఇందుపల్లి బాబూ పోతన గత నెల 18న మృతి చెందారు. చర్చిలో విశ్వాసుల సమక్షంలో గురువారం జ్ఞాపకార్థ కూడిక నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రదర్ రవీంద్రనాథ్ మాట్లాడుతూ బ్రదర్ బాబూ పోతన మైలవరంలో క్రీస్తు సంఘం ఏర్పాటు చేసి గత 50 ఏళ్లుగా సువార్త అందిస్తున్నారని తెలిపారు. ఈయనకు భార్య విశాలత, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. తిరువూరు, పాస్టర్లు ఇందుపల్లి ఇస్రాయేలు, చంద్రపాల్, ఎమ్ ప్రసాదరావు, టి.ప్రసన్నకుమార్ తదితరులు వాక్య పరిచర్య చేశారు. చర్చి మిషన్ ఇన్‌చార్జిగా ఇందుపల్లి నవీన్ బాధ్యతలు స్వీకరించనున్నారు. ఆర్‌అండ్‌బీ సూపరింటెండెంట్ చిట్టిపోతుల దానియేలు పర్యవేక్షించారు.

జగ్జీవన్‌రామ్ విగ్రహ ఏర్పాటుకు శంకుస్థాపన

ఆగిరిపల్లి: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఎస్సీలకు ఎప్పుడూ అండగా ఉంటుందని ఈదర పీఏసీఎస్ చైర్‌పర్సన్, ఆ పార్టీ సీనియర్ నాయకుడు దన్నపనేని వెంకట సత్యనారాయణ(వేణు) అన్నారు. ఎస్సీవాడలో మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహ ఏర్పాటుకు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు హామీ ప్రకారం శంకుస్థాపన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. నాయకులు దన్నపనేని సత్యంబాబు, గోళ్ల ఇసాక్, దొండపాటి సామియేలు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

జి.కొండూరు: జి.కొండూరు గ్రామానికి చెందిన పజ్జూరు పుల్లారావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. మృతుడు స్థానిక పీఏసీఎస్ బ్యాంకులో సభ్యుడిగా ఉన్నందున బ్యాంకు నుంచి మంజూరైన రూ.10 వేలను, మృతుడి భార్య మైసమ్మకు బ్యాంకు చైర్మన్ వేములకొండ రాంబాబు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ సహకార బ్యాంకుల్లో రుణగ్రహీతలుగా ఉండి 18 నుంచి 59 ఏళ్లలోపు ఉన్నవారు సాధారణ మరణం పొందితే రూ.లక్ష బీమా నగదు అందిస్తామన్నారు. కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల దాహార్తిని తీర్చుదాం



ముసునూరు: వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు సమగ్ర కృషి చేసి అన్ని గ్రామాల ప్రజల దాహార్తి తీర్చుదామని వైస్ ఎంపీపీ కె.రాజానాయన, జెడ్పీటీసీ సభ్యుడు వరికూటి ప్రతాప్ తెలిపారు. ఎంపీడీఓ జి.రాణి ఆధ్వర్యంలో ఎంపీపీ రాపర్ల కృష్ణకుమారి అధ్యక్షతన గురువారం మధ్యాహ్నం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి సీహెచ్ శ్రీనివాసరావు, వైద్యాధికారులు ఎం.కిరణ్‌కుమార్, అవినాష్, ఎంఈఓ రత్నకుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సత్యప్రసాద్ ఆయా శాఖల ప్రగతిని వివరించారు. అన్ని గ్రామాల్లో మోటార్లకు మరమ్మతులు చేయించి, పైపులైన్ల నిర్మాణాలను పునరుద్ధరించనున్నట్లు తెలిపారు. సమావేశంలో తహసీల్దార్ దాసరి సుధ, ఏఈ నరసింహారావు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

నూజివీడు: యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని నూజివీడు రూరల్ సీఐ ఆర్.అంకబాబు తెలిపారు. మండలంలోని పల్లెర్లమూడి జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులకు మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై గురువారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ.. యువత మాదక ద్రవ్యాలకు అలవాటై జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. చెడు స్నేహాలు, చెడు అలవాట్లకు స్వస్తి పలికి తల్లిదండ్రులు, అధ్యాపకులు చెప్పిన మాటలు విని చక్కగా చదువుకొని జీవితంలో ఉన్నత స్థానాలకు ఎదగాలన్నారు. రూరల్ ఎస్ఐ తలారి రామకృష్ణ, హెచ్‌ఎం జె.సాంబశివరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రయోగాత్మక విద్యతో ఉత్తమ ఫలితాలు

మైలవరం: ప్రయోగాత్మక విద్యతో ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ల రవి తెలిపారు. మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని ల్యాబ్‌లను స్థానిక లిటిల్ ఫ్లవర్ జూనియర్ కాలేజ్ ఇంటర్మీడియెట్ విద్యార్థులు గురువారం సందర్శించారు. ప్రిన్సిపాల్ రవి కళాశాలలోని కెమిస్ట్రీ, బోటనీ, ఫిజిక్స్ లేబొరేటరీలతో పాటు కంప్యూటర్ ల్యాబ్, డిజిటల్ లైబ్రరీ, ఇన్నోవేషన్ సెంటర్, నూతనంగా నిర్మించిన సెమినార్ హాల్, జేకేసీ ల్యాబ్‌లను చూపించి వాటి ప్రత్యేకతలను వివరించారు. పాఠ్యాంశాలతో పాటుగా ప్రయోగాల ద్వారా విజ్ఞానంపై ఆసక్తి పెరుగుతుందని చెప్పారు. ప్రభుత్వ కళాశాలల్లో విద్యార్థులకు అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయన్నారు.